క్లుప్తంగా

కుమారస్వామికి విశేష పూజలు



శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబా మల్లికార్జునస్వామి వార్ల ఆలయ ప్రాంగణంలోని కుమార స్వామి ఉపాలయంలో మంగళవారం ఆలయ అధికారులు, అర్చకులు విశేషక్రతువులను నిర్వహించారు. కుమారస్వామికి అభిషేకము, సుబ్రహ్మణ్య, అష్టోత్తరము చేసిన అనంతరం స్తోత్రపారాయణాలు చేశారు. స్వామివారికి పంచామృతాలు, వివిధ పండ్ల రసాలతో అభిషేక కార్యక్రమం నిర్వహించారు.

దేవస్థానానికి కెమెరా బహూకరణ



కెమెరాను విరాళంగా దేవస్థాన అధికారులకు అందజేస్తున్న దాతలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానానికి హైదరాబాద్‌కు చెందిన బి.సాంబశివరావు (ప్రైమార్కు ఎంటర్‌ప్రైజెస్) ఫొటో కెమెరాను విరాళంగా అందజేశారు. మంగళవారం దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎస్.ఎస్.చంద్రశేఖర ఆజాద్‌కు కెమెరాను దాతలు అందజేశారు. దాతలకు దేవస్థానం తరుపున స్వామివారి శేష వస్త్రాలను, లడ్డుప్రసాదాలను అందజేసి సత్కరించారు. మల్లికార్జునస్వామి ఆలయ ప్రధానార్చకులు హెచ్.వీరయ్యస్వామి, సీనియర్ వేదపండితులు గంటి రాధాకృష్ణశర్మ, పీఆర్వో టీ.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రబీ ప్రీమియం రైతులే చెల్లించాలి

బండి ఆత్మకూరు : రైతులు రబీ సీజన్‌లో సాగుచేసిన పంటల బీమాకు సంబంధించిన ప్రీమియంను రైతులే చెల్లించుకోవాలని ఏఓ స్వాతి తెలిపారు. మండల పరిధిలోని పార్నపల్లి గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ..బీమా ప్రీమియంను సీఎస్‌సీ సెంటర్‌లో జొన్న ,మినుము పంటలకు 15 వ తేదీలోపు బీమా చెల్లించుకోవాలని సూచించారు. వరికి ఈ నెల 30 వరకు అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ షబ్బీర్, రైతులు పాల్గొన్నారు.

వర్షానికి ముందు కోతలొద్దు

మహానంది: కోతకు సిద్ధంగా ఉన్న వరి పంటను వర్షానికి ముందు కోయవద్దని ఏఓ నాగేశ్వర రెడ్డి సూచించారు. సీతారామపురం గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆయన కోత కోసి పొలంలో ఉన్న పన్నలు వర్షానికి తడిచినట్లయితే మొలకెత్తకుండా ఉండేందుకు ఉప్పు ద్రావణాన్ని పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ, పశుసంవర్ధక శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

పగిద్యాల: మండలంలో 5 ఎకరాల్లోపు పొలం కలిగిన ఎస్సీ, ఎస్టీ రైతులు బహువార్షిక గడ్డి సాగు కోసం దరఖాస్తు చేసుకోవాలని ముచ్చుమర్రి పశువైద్యాధికారిణి రాగసంధ్య తెలిపారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద బహువార్షిక గడ్డి సాగుకు సబ్సిడీ మంజూరవుతుందని చెప్పారు. ఈ అవకాశాన్ని వ్యవసాయ బోర్లు, బావులు కలిగిన రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు కోసం ఉపాధి కార్యాలయం, పశు వైద్యశాలలో సంప్రదించాలని పేర్కొన్నారు.

హుసేన్‌సాహెబ్ సేవలు మరువలేనివి



హుసేన్‌సాహెబ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అభిమానులు

ఆత్మకూరు: ఆత్మకూరు మేజర్ గ్రామ పంచాయతీ దివంగత సర్పంచ్ మోమిన్ హుసేన్‌సాహెబ్ సేవలు మరువలేనివని రైతుసేవా సంఘం గౌరవాధ్యక్షుడు మోమిన్ మునీర్‌బాషా, సంఘం అధ్యక్షుడు బైరాపురం షేక్‌మహబూబ్‌బాషా, రహంతుల్లా అన్నారు. పట్టణంలోని రైతు సేవా కేంద్రం కార్యాలయంలో హుసేన్‌సాహెబ్ 33వ వర్ధంతి సభను నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ ఆత్మకూరు మేజర్ గ్రామ పంచాయతీకి 56 ఏళ్లపాటు మోమిన్ హుసేన్‌సాహెబ్, కుటుంబ సభ్యులు సర్పంచ్‌గా బాధ్యతలు చేపట్టి ప్రజలకు ఎనలేని సేవలు అందించారన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు లింగమూర్తి, టైగర్‌బాబు, రఫిక్, ముసలమడుగు నబి సాహెబ్, రసూల్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్యాలయంలో..

ఆత్మకూరు: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం దివంగత సర్పంచ్ మోమిన్ హుసేన్‌సాహెబ్ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా అంజుమన్ ఏ ఖబరస్తాన్ కమిటీ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కమిటీ చైర్మన్ మోమిన్ ఇబ్రహీం, ఖలీలుల్లా, వైస్ చైర్మన్ బైరాపురం మహబూబ్‌బాషా, సలహాదారులు మోమిన్ మహబూబ్‌సుభానీ, యస్.ఎస్.సలావుద్దీన్, సభ్యులు పాల్గొన్నారు.

ధాన్యం.. వర్షార్పణం

- తుపాను ప్రభావంతో కురుస్తున్న వర్షాలు
- తడిసిన ధాన్యం
- మార్కెట్‌లో తగ్గిన ధరలు
- అన్నదాతకు తీవ్ర నష్టం



బండినాయునిపాలెం వద్ద నేలవాలిన వరిపంట



తమ్మడపల్లె వద్ద ధాన్యంపై పట్టలు కప్పిన దృశ్యం

మహానంది: అన్నదాతల గుండెల్లో ఫెంగల్ తుపాను గుబులు పుట్టిస్తోంది. కష్టపడి నిద్రాహారాలు మాని, వేలకు వేలు పెట్టుబడి పెట్టి వరి పంటలను సాగు చేసిన రైతుల కంట కన్నీరు పెట్టిస్తోంది. మూడు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలతో పొలాల్లో ఆరబెట్టుకున్న వరి ధాన్యం తడిచిపోతుండటంతో రైతన్నలకు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. అసలే ధరలు అమాంతం తగ్గిపోగా వచ్చిన దిగుబడులను అమ్ముకుని కనీసం పెట్టుబడుల్లో సగమైనా వస్తుందనుకుని ఎదురు చూస్తున్న అన్నదాతల ఆశలు వర్షార్పణం అవుతున్నాయి.

మార్కెట్‌లో తగ్గిన ధరలు

మహానంది మండలంలో సాగు చేస్తున్న పంటల్లో అరటి తర్వాత వరి ప్రధానమైంది. ఈ ఏడాది ఖరీఫ్‌లో వేలాది ఎకరాల్లో వరి పంటలను సాగు చేశారు. బొల్లవరం, తిమ్మాపురం, అబ్బీపురం, గోపవరం, బుక్కాపురం, నందిపల్లె, సీతారామపురం, మసీదుపురం తదితర గ్రామాల పరిధిలో వరి అత్యధిక విస్తీర్ణంలో సాగు చేశారు. రైతులకు దిగుబడులు ఆశించిన మేరకు వచ్చినా ధర మాత్రం తగ్గిపోవడంతో దిగులు చెందుతున్నారు.

వర్షం.. రైతుల్లో టెన్షన్

కొత్తపల్లి: ఫెంగల్ తుపాన్‌తో రైతుల్లో ఆందోళన నెలకొంది. వర్షంతో కోత దశలో ఉన్న పంటలు ఎక్కడ దెబ్బతింటాయోనని రైతులు టెన్షన్ పడుతున్నారు. కొత్తపల్లి మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం తెల్లవారుజామున మోస్తరు వర్షం కురిసింది. గువ్వలకుంట్ల, బండినాయిని పాలెం, జి.వీరాపురం, లింగాపురం, శివపురం, గుమ్మడాపురం, కొక్కెరంచ, ఎదురుపాడు నందికుంట, దుద్యాల గ్రామాలతో పాటు కొత్తపల్లి మండల కేంద్రంలో 10.8 మి.మీల వర్షపాతం నమోదైంది. పలు ప్రాంతాల్లో వరి నేలవాలింది. కోసిన వరి ధాన్యం తడవకుండా పట్టలు కప్పి సంరక్షిస్తున్నారు. మరికొందరు వరిధాన్యం వర్షానికి తడవకుండా ట్రాక్టర్లతో తరలిస్తున్నారు. వర్షానికి తడిసిన పంటలను ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించి కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.

ధాన్యం తడిసిపోయింది

ఈ చిత్రంలో కనిపిస్తున్న రైతు పేరు చెవులు వెంకటసుబ్బయ్య. మహానంది మండలం గోపవరం గ్రామానికి చెందిన వెంకటసుబ్బయ్య నాకున్న మూడు ఎకరాల్లో వరి సాగు చేశా. దిగుబడిని అమ్ముకుందామంటే అనుకున్న మేరకు ధర లేకపోవడంతో విక్రయించకుండా గ్రామంలోని ఖాళీ స్థలంలో ధాన్యాన్ని ఆరబెట్టుకున్నా. అయితే ఫెంగల్ తుపాన్ కారణంగా వర్షం పడుతుండటంతో ధాన్యంపై పట్టలు కప్పా. అయినా వర్షానికి దిగుబడిలో 20 బస్తాలకు పైగా వరి తడిసిపోయింది. ప్రభుత్వమే ఆదుకోవాలి.

– చెవులు వెంకటసుబ్బయ్య, గోపవరం, మహానంది మండలం



గోపవరం వద్ద వర్షానికి తడిసిన వడ్లు



వర్షం భయంతో ధాన్యాన్ని బస్తాలకు నింపుతున్న రైతులు,



తమ్మడపల్లె వద్ద దిగుబడిని కాపాడుకునేందుకు పట్టలు కప్పుతున్న రైతన్నలు,



వీరాపురంలో తడవకుండా కప్పిన పట్టలు

పంట నమోదు తప్పనిసరి

పాములపాడు: రబీలో పంటలు సాగు చేసిన రైతులు తప్పనిసరిగా పంట నమోదు చేయించుకోవాలని ఆత్మకూరు ఏడీఏ ఆంజనేయ అన్నారు. మంగళవారం మండలంలోని బానుముక్కల, బానకచెర్ల గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. అనంతరం రైతు సేవా కేంద్రాల వద్ద రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు. పంటల బీమా గురించి వివరించారు. ఈ నెల 15వ తేదీలోపు పంటల బీమా చేయించుకోవాలని సూచించారు. శనగ, జొన్న, మినుము, వరి, ఉల్లి, పంటలకు బీమా వర్తిస్తుందని పేర్కొన్నారు. రైతులు ఆయా గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో వీఏఏలను సంప్రదించాలని చెప్పారు. మండల వ్యవసాయాధికారి ఫణీశ్వరరెడ్డి, వీఏఏ షంషాద్, ఎంపీఈఓ ఇలియాజ్ పాల్గొన్నారు.

రేపు మౌలాలి స్వామి సరిగెత్తు

కొత్తపల్లి: మండలంలోని పాతమాడుగుల గ్రామంలో గురువారం గ్రామపెద్దలు, గ్రామస్తుల సహకారంతో మౌలాలిస్వామి సరిగెత్తు నిర్వహించనున్నారు. అగ్నిగుండం, పీర్ల ఊరేగింపు, పీర్లను కాటికి సాగనంపే కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని గ్రామ పెద్దలు పెరుగు నాగలక్ష్మీ రెడ్డి, డీలర్ వెంకటస్వామి, పులికంటి రమణయ్య, పాలెం శ్రీనివాసులు, గడ్డం శ్రీనివాసులు తెలిపారు. భక్తులకు అన్నదానం చేయనున్నట్లు పేర్కొన్నారు. సరిగెత్తు సందర్భంగా గ్రామంలో క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

నేడు కంటి వైద్య శిబిరం

పాములపాడు: మండల కేంద్రంలోని చౌడేశ్వరిదేవి ఆలయం వద్ద బుధవారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ మేకల భాగ్య మ్మ తెలిపారు. నంద్యాల శాంతిరాం హాస్పిటల్ ఆధ్వర్యంలో శిబిరం జరుగుతుందన్నారు. పాములపాడుతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

లక్ష్యంతో చదవాలి

బండిఆత్మకూరు: విద్యార్థులు పోటీతత్వాన్ని అలవర్చుకోవాలని, ఒక లక్ష్యంతో చదివితే చదువులో రాణించడం సులభమని డీఈఓ పి. జనార్దన్‌రెడ్డి అన్నారు. బండి ఆత్మకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించడానికి విద్యార్థులకు పలు సూచనలు చేశారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంఈఓలు మోహన్ రెడ్డి, యశోద, హెచ్‌ఎం నూర్జహాన్ పాల్గొన్నారు. అనంతరం స్థానిక భవిత సెంటర్‌లో నిర్వహించిన అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవంలో పాల్గొని దివ్యాంగ విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు.

విభిన్న ప్రతిభావంతులను ప్రోత్సహించాలి

ఆత్మకూరు: విభిన్న ప్రతిభ గల విద్యార్థులను ప్రోత్సహించాలని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం ప్రభావతి అన్నారు. మంగళవారం పట్టణంలోని భవిత కేంద్రంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఐఈఆర్‌పీ మంజు, ఉపాధ్యాయులు శోభన్‌బాబునాయక్, ప్రమీల, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని జీవనజ్యోతి దివ్యాంగుల సేవాసంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆ సంఘం గౌరవాధ్యక్షులు ఎస్.ఎస్.జిలానీ, రషీద్, అధ్యక్షుడు వేణుగోపాల్, ఉపాధ్యక్షులు డి.చెన్నయ, రహీమాన్, అబ్దుల్‌కరీం తదితరులు కేక్ కట్ చేశారు.

దివ్యాంగులు అన్ని రంగాల్లో రాణించాలి

జూపాడుబంగ్లా: దివ్యాంగులు ఎవరికీ ఏమాత్రం తీసిపోకుండా అన్ని రంగాల్లో రాణించాలని మండల విద్యాధికారి చిన్నమద్దిలేటి అన్నారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని జూపాడుబంగ్లా భవిత పాఠశాలలో వేడుకలు నిర్వహించారు. శరీర, మానసిక లోపాలున్న చిన్నారులను తల్లిదండ్రులు జాగ్రత్తగా సంరక్షించడంతో పాటు వారిని తీర్చిదిద్దాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. భవిత పాఠశాలకు పంపించి విద్యాబుద్ధులు నేర్చుకునేలా చేయాలన్నారు. అనంతరం చిన్నారులకు ఆటలు, పాటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు నాగేంద్రుడు, ఓబన్న, దుర్గాప్రసన్న, హెచ్‌ఎం బషీర్‌అహ్మద్ పాల్గొన్నారు.

–నందికొట్కూరు: దివ్యాంగ పిల్లల సంక్షేమం కోసమే భవిత సెంటర్లు ఉన్నాయని ఎంఈఓ సుభాన్ అన్నారు. పట్టణంలోని భవిత సెంటర్‌లో దివ్యాంగుల దినోత్సవం నిర్వహించారు. ఉన్నత శిఖరాలకు ఎదగడానికి వైకల్యం అడ్డంకి కాదని, సంకల్పమే సకల విజయానికి మూలమని స్పష్టం చేశారు. భవిత స్కూల్‌లో ప్రత్యేక ఉపాధ్యాయులను నియమించి విద్యను నేర్పిస్తున్నట్లు తెలిపారు. అనంతరం పిల్లలకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు.

–మిడుతూరు: స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల(మెయిన్)లో ఉన్న భవితా కేంద్రంలో వేడుకలు నిర్వహించారు. ఎంఈఓ–2 శ్రీనాథ్ ఆధ్వర్యంలో ర్యాలీ చేశారు. ఏదైనా సాధించగలననే పట్టుదల విభిన్న ప్రతిభావంతులకు మెండుగా ఉంటుందన్నారు. అనంతరం ఆటల పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. ఉపాధ్యాయులు షహనాజ్, మియబాషా పాల్గొన్నారు.

ఎందులోనూ తక్కువ కాదు

పాములపాడు: విభిన్న ప్రతిభావంతులైన విద్యార్థులు సాధారణ విద్యార్థులకు ఏ విషయంలోనూ తక్కువ కాదని ఎంఈఓ 2 సుభాషిణి దేవి అన్నారు. దివ్యాంగ విద్యార్థులకు చదువు ఒక ఆయుధం లాంటిదని పేర్కొన్నారు. అనంతరం ఆటపోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. హెచ్‌ఎం గోపాల్, ఉపాధ్యాయులు స్వామిశేఖర్, శ్రీనివాసులు, సాయిరాం, రాంప్రసాద్ పాల్గొన్నారు.



దివ్యాంగ విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న డీఈఓ జనార్దన్ రెడ్డి



జూపాడుబంగ్లా: మాట్లాడుతున్న ఎంఈఓ చిన్నమద్దిలేటి



మిడుతూరు: క్రీడాపోటీల్లో విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎంఈఓ శ్రీనాథ్

దివ్యాంగులు అన్ని రంగాల్లో పోటీ పడాలి



వెలుగోడులో చిన్నారులకు పలకలు అందిస్తున్న అధికారులు

వెలుగోడు: దివ్యాంగులు అన్ని రంగాల్లో పోటీ పడాలని ఎంపీడీఓ మధుసూదన్ రెడ్డి అన్నారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా మంగళవారం ఎంపీపీ స్పెషల్ స్కూల్, రోకియాబి దర్గాలో ఘనంగా నిర్వహించారు. అంతకుముందు పట్టణంలో పురవీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈఓలు నాగ బ్రహ్మయ్య, బ్రహ్మం నాయక్, హెచ్‌ఎం నాగలింగేశ్వరమ్మ, ఐఈఆర్టీలు సుబ్రహ్మణ్యం, కుదరతుల్లా వీహెచ్‌పీఎస్ నాయకులు అబ్దుల్ రవూఫ్, ఇంతియాజ్ తదితరులు పాల్గొన్నారు.

మహానంది: విభిన్న ప్రతిభావంతులను ప్రోత్సహించి వారిలోని ప్రతిభను వెలికితీయాలని ఆంధ్రప్రదేశ్ సమగ్ర శిక్షా కో ఆర్డినేటర్ ఎం.శ్రీనివాసులు అన్నారు. గాజులపల్లెలోని ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీనివాసులు, ఐఈఆర్‌టీలు హైమావతి, సురేఖ, ఎస్‌ఎంసీ చైర్మన్ మేరీ పాల్గొన్నారు.

శ్రీశైలంప్రాజెక్ట్: సున్నిపెంటలోని భవితకేంద్రంలో మంగళవారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని జరుపుకున్నారు. ఎంఈఓ కరీముల్లా కార్యక్రమంలో పాల్గొని దివ్యాంగులకు అమలవుతున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. అనంతరం చిన్నారులకు డాక్టర్ శ్రీకాంత్ ఫిజియోథెరపీ చేశారు. ఉపాధ్యాయులు వరప్రసాద్,`శివకుమార్, వెంకటస్వామి, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యంలో ఓటే ఆయుధం





బీఎల్‌ఓల సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌డీఓ నాగజ్యోతి, హాజరైన బీఎల్‌ఓలు, డీటీలు, రెవెన్యూ సిబ్బంది

నందికొట్కూరు: ఓటు ఎంతో విలువైనదని ప్రతి ఒక్కరికీ తెలియజేయాలని ఆర్‌డీఓ నాగజ్యోతి అన్నారు. మంగళవారం పట్టణంలోని అల్వాల కల్యాణ మండపంలో నియోజకవర్గ స్థాయిలో ఏర్పాటు చేసిన బీఎల్‌ఓల సమావేశంలో ఆమె మాట్లాడారు. దేశ, రాష్ట్ర పాలకులను ఎన్నుకోవాలంటే ఓటు అనే ఆయుధమే కీలకంగా మారుతుందని చెప్పారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేయించుకునే విధంగా బీఎల్‌ఓలు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఓటరు నమోదు ప్రత్యేక క్యాంపులు సక్రమంగా నిర్వహించాలని సూచించారు. ఓటరు జాబితాలో ఎలాంటి తప్పులు దొర్లినా చేర్పులు మార్పులు చేయాలన్నారు. ఓటు నమోదు కార్యక్రమం నిరంతర ప్రక్రియ అని చెప్పారు. ఓటు విలువపై యువతకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత తహసీల్దార్లు, సిబ్బంది, బీఎల్‌ఓలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ప్రత్యేక క్యాంపులపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో తహసీల్దార్లు శ్రీనివాసులు, శివరాముడు, ఉమారాణి, సుభద్ర, శ్రీనివాసులు, చంద్రశేఖర్‌నాయక్, డీటీలు మధుసుధాకర్, సత్యనారాయణ, సోమేశ్వరిదేవి, పెద్దన్న, కిషోర్, సునీల్‌రాజా, మధు, ఆర్‌ఐలు, వీఆర్వోలు పాల్గొన్నారు.

బుక్ కీపర్‌ను తొలగిస్తే ఆందోళన చేస్తాం

నందికొట్కూరు: మల్యాల గ్రామంలో 37 పొదుపు గ్రూపులకు 27 ఏళ్ల నుంచి పనిచేస్తున్న శ్రీరాములు గౌడును తొలగిస్తే ఆందోళన కార్యక్రమాలను చేపడతామని సీపీఎం నాయకుడు నాగేశ్వరరావు తెలిపారు. మంగళవారం పట్టణంలోని స్త్రీ శక్తి భవనం ఎదుట మల్యాల గ్రామ పొదుపు మహిళలతో కలిసి సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా చేశారు. బుక్ కీపర్‌ను టీడీపీ నాయకులు తొలగించి తమ పార్టీ కార్యకర్తలకు కట్టబెట్టేందుకు సిద్ధం అవుతున్నారని ఆరోపించారు. ఎలాంటి ఫిర్యాదులు లేకపోయినా బుక్ కీపర్‌ను తొలగించేందుకు ప్రయత్నించడం తగదన్నారు. సీఐటీయూ నాయకులు ఉస్మాన్, గ్రామస్తులు ఎల్లనాయుడు, షేక్షావలి, ఆంజనేయులు, సరోజమ్మ, లక్ష్మిదేవి, ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.



స్త్రీశక్తి భవనం ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు, పొదుపు మహిళలు

రైతులు అప్రమత్తంగా ఉండాలి

వెలుగోడు: తపాను నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని ఏఓ పవన్ కుమార్ సూచించారు. పట్టణంలోని జమ్మినగర్ తండాలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఏఓ మాట్లాడుతూ రబీలో సాగు చేసిన పంటలను రైతులు కచ్చితంగా నమోదు చేసుకోవాలని, రబీ పంటలకు పంట బీమా ప్రీమియం చెల్లించి ప్రతి రైతు పంట బీమా రక్షణ పొందాలన్నారు. తుపాను ప్రభావం ఉన్నందున రైతులు వరి కోతలు వాయిదా వేసుకోవాలని, ఇప్పటికే కోత కోసిన వరి దిగుబడులు సురక్షిత ప్రాంతానికి తరలించుకోవాలని సూచించారు. అనంతరం క్షేత్రస్థాయిలో మినుము పంటను, పంట కోత చేసిన వరి ధాన్యాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఏఈఓ అంజిత్ కుమార్ రెడ్డి, వ్యవసాయ విస్తరణ సిబ్బంది నాగమణి, రామకష్ణ తదితరులు పాల్గొన్నారు.



వరి ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఏఓ పవన్ కుమార్

పాములపాడులో మోస్తరు వర్షం

పాములపాడు: ఫెంగల్ తుపాన్ ప్రభావంతో మండలంలో మంగళవారం మోస్తరు వర్షం కురిసింది. సోమవారం రాత్రంతా వర్షం కురుస్తూనే ఉంది. ఉదయం నుంచి కూడా చిరుజల్లులు కురిశాయి. దీంతో వాతావరణం చల్లగా మారింది. వాతావరణంలో మార్పులు చోటుచేసుకోవడంతో కొన్ని పంటలకు అనుకూలంగా మారగా..కొన్ని పంటలకు ప్రతికూలంగా మారిందని రైతులు వాపోయారు.

అలరించిన నృత్యప్రదర్శన

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆలయ దక్షిణ మాఢవీధిలోని నిత్యకళావేదికపై ఎమ్మిగనూరుకు చెందిన నటరాజ కూచిపూడి నృత్య సంస్కృతి కళాక్షేత్రం వారిచే సంప్రదాయ నృత్యం ప్రదర్శించారు. కార్యక్రమంలో గణపతి ప్రార్థన, భో శంభో, శివాష్టకం, లింగాష్టకం, కాలభైరవాష్టకం, కనకధారస్తోత్రం, ఆనందతాండవం తదితర గీతాలకు, అష్టకాలకు మనస్విని, మీనాక్షి, లిక్షిత, లాస్య, మౌనిక, చంద్ర, వినిత, శ్రావణి, ప్రీతి తదితరులు నృత్యం చేశారు.

ఫసల్ బీమా ఉంటేనే నష్టపరిహారం

కొత్తపల్లి: పంటలు సాగు చేస్తున్న ప్రతి రైతు ప్రధాన మంత్రి ఫసల్‌బీమా యోజన ఇన్సూరెన్స్ కట్టి ఉంటేనే పంట నష్టపరిహారం అందుతుందని మండల వ్యవసాయాధికారి కె.మహేష్ అన్నారు. మంగళవారం మండలంలోని శివపురం, గుమ్మడాపురం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. రెండోసారి పంట వేసుకున్న ప్రతి రైతు తప్పనిసరిగా పీఎం ఫసల్ బీమా యోజన ఇన్సూరెన్స్ చేయించుకోవాలన్నారు. రెండు, మూడు రోజుల్లో తుపాన్ హెచ్చరికలు ఉన్నందున కోతకు సిద్ధంగా ఉన్న వరి పంటలని కోసుకోకూడదని సూచించారు. ప్రస్తుతం వరి గింజలు తడిసినట్లయితే మొలకెత్తకుండా ఉండడానికి ఐదు శాతం ఉప్పు ద్రావణాన్ని పనలపై ఉండే విధంగా పిచికారీ చేసుకోవాలని చెప్పారు. సర్పంచ్ విజయకుమార్, ఉపసర్పంచ్ శ్రీనివాసులు యాదవ్ పాల్గొన్నారు.

రబీ పంటలపై అవగాహన

ఆత్మకూరు: ఈ ఏడాది రబీ సీజన్‌లో సాగుచేసిన వివిధ పంటలపై తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలపై మండల వ్యవసాయ అధికారుల ఆధ్వర్యంలో అవగాహన సదస్సులు నిర్వహించారు. మండలంలోని కురుకుంద, కొట్టాలచెరువు గ్రామాల్లో మంగళవారం మండల వ్యవసాయాధికారి విష్ణువర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో సదస్సులు జరిగాయి. రైతులు సాగు చేసిన మినుము, మొక్కజొన్న, వేరుశనగ, మిర్చి పంటలపై తెగుళ్లు, చీడపీడల నివారణపై తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలపై పొలంబడి కార్యక్రమంలో భాగంగా సలహాలు, సూచనలు ఇచ్చారు.

రసాయనిక ఎరువులతో అనర్థాలు

జూపాడుబంగ్లా: రైతులు రసాయనిక ఎరువులు, పురుగు మందుల వాడకం తగ్గించుకోవాలని మండల వ్యవసాయ అధికారి కృష్ణారెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని పారుమంచాల గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా రైతులు ఎప్పటికప్పుడు ఆధునిక వ్యవసాయ సాంకేతిక పద్ధతులు పాటిస్తూ తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించాలని సూచించారు. ముఖ్యంగా రైతులు రసాయనిక ఎరువులు, క్రిమిసంహారక మందులు అధిక మోతాదులో వాడడం తగ్గించుకోవాలన్నారు. సేంద్రీయ ఎరువులు, జీవరసాయనిక ఎరువులు వాడడం ఉత్తమమని పేర్కొన్నారు. ముఖ్యంగా ఏటా పంట మార్పిడి పాటించాలని సూచించారు.

పర్యావరణాన్ని పరిరక్షించుకుందాం

మహానంది: పర్యావరణాన్ని పరిరక్షించుకునే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, పర్యావరణం దెబ్బతింటే భవిష్యత్ తరాలను మరింత ముప్పు తప్పదని మహానంది వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ వీర జయలక్ష్మి అన్నారు. జాతీయ సేవా పథకంలో భాగంగా నాలుగవ రోజు అల్లినగరం గ్రామంలో వ్యవసాయ విద్యార్థులు మొక్కలు నాటారు. ఈ మేరకు డాక్టర్ వీర జయలక్ష్మి విద్యార్థులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ శ్రీనివాసరెడ్డి, డాక్టర్ మాధవి, తదితరులు పాల్గొన్నారు.

మహాసభలను విజయవంతం చేయండి

ఆత్మకూరు: సీపీఎం నంద్యాల జిల్లా రెండో మహాసభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఏసురత్నం, పట్టణ కార్యదర్శి రణధీర్ పిలుపునిచ్చారు. పట్టణంలోని ధనుంజయ మీటింగ్ హాల్‌లో మంగళవారం ఆ పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఈనెల 9న నందికొట్కూరు పట్టణంలో ఈ మహాసభలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మహాసభలకు సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎం.ఎ.గఫూర్, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ప్రభాకర్‌రెడ్డి హాజరవుతారన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు మంజుల, షేక్ ఇస్మాయిల్, సురేంద్ర, కిరణ్, రవి, రమణ, గణపతి తదితరులు పాల్గొన్నారు.

చినుకు పడితే జలమయమే



బస్టాండ్ ఆవరణలో నిలిచిన వర్షపు నీరు

మిడుతూరు: మండల కేంద్రం మిడుతూరులో మంగళవారం కురిసిన చిన్నపాటి వర్షానికే బస్టాండ్ ఆవరణమంతా జలమయమైంది. వర్షపు నీరు చేరడంతో మోకాళ్ల లోతు నీరు రహదారిపై నిలిచిపోయాయి. దీంతో ప్రయాణికులు, వాహనదారులు, వివిధ గ్రామాలకు వెళ్లే గ్రామస్తులు తీవ్ర అగచాట్లు ఎదుర్కోవాల్సి వచ్చింది. మండల కేంద్రం అయినా సరైన రహదారులు, డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో ఏళ్ల తరబడి సమస్యను ఎదుర్కొంటున్నామని స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి స్థానిక ఎంపీడీఓ కార్యాలయం, బ్రహ్మంగారి మఠం, తహసీల్దార్ కార్యాలయం వైపు వెళ్లే ప్రధాన రహదారుల ఏర్పాటుతో పాటు డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచాలని కోరుతున్నారు.